
ప్రజాశక్తి

శనివారం 19 జులై 2025 5 విజయనగరం



సుపరిపాలనపై టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరంకోట

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కోట జంక్షన్‌లో నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వీడియోను రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా తొలత 8, 9, 24, 25, 26వ డివిజన్లలో ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం కోట వద్ద జరిగిన సభలో వీరితో పాటు నియోజకవర్గ పరిశీలకులు వీరేష్‌చంద్రదేవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమ పాలన సాగిస్తున్నామని తెలిపారు. అనంతరం ఇందుకు సంబంధించిన వీడియోను ప్రదర్శించారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

50 శాతం ఎరువులు ప్రయివేటు దారి

- ఆర్‌బికెలకు 30 శాతమే
- మిగిలిన 20శాతం సొసైటీల ద్వారా...
- స్థానికంగా దొరక్క అవస్థలు పడుతున్న రైతులు
- ప్రభుత్వ విధానంలో లోపమే కారణం



సంకిలిలో యూరియా కోసం పాట్లు పడుతున్న రైతులు

అధికారిక సమాచారం ప్రకారం అవసరానికి మించిన ఎరువులు. ఊరూరా క్షేత్ర స్థాయి సిబ్బంది. నిల్వ చేసుకునేందుకు ఆర్‌ఎస్‌కె భవనాలు. ఇలా ఎన్నో సదుపాయాలు, ఎంతో నెట్ వర్కు వ్యవసాయ శాఖకు ఉంది. కానీ, ఎరువులు పంపిణీ విధానంలో ప్రభుత్వ విధానాల లోపం రైతులకు గ్రహపాటుగా మారింది. ఎరువుల కోసం రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, పత్తి, చెరకు, నువ్వులు, పెసలు, మినుములు తదితర అపరాల పంటలన్నీ కలుపుకుని 2,92,500 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా ఇప్పటి వరకు సుమారు 55,113 ఎకరాలు సాగులోకి వచ్చాయి. వివిధ పంటల దశ, సీజనల్ కండీషన్‌ను బట్టి ప్రస్తుతానికి 4,200 మెట్రిక్ టన్నులు యూరియా, 2700 మెట్రిక్ టన్నుల డిఎపి సరిపోతుందని అధికారుల అంచనా. కానీ, అంతకు మించి యూరియా 6,817 మెట్రిక్ టన్నులు, డిఎపి 3,151 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని అధికారులు చెబుతున్నారు. కానీ వాస్తవంగా రైతులు ఎరువులు అందక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంపిణీ విధానంలోని లోపమే ఇందుకు మూలకారణంగా తెలుస్తోంది. జిల్లాకు కేటాయించే ఎరువుల్లో 50శాతం ప్రైవేటు డీలర్లకు కేటాయించారు. మిగిలిన 50శాతంలో 30శాతం రైతు సేవాకేంద్రాలకు, డిసిఎంఎస్, పిఎసిఎస్, ఎఫ్‌పిఒ (ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్లు)కు కేటాయించారు. ప్రతి రెండు మూడు గ్రామాలకు ఒక్కటిగావున్న రైతు సేవ కేంద్రాలకు 30శాతం మాత్రమే కేటాయించడం వల్ల ఎటూ సరిపోని పరిస్థితి నెలకొంది. మరో 20శాతం ఎరువుల కోసం 5నుంచి 15 కిలోమీటర్ల పరిధిలోవున్న డిసిఎంఎస్, పిఎసిఎస్, ఎఫ్‌పిఒ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడగా, మిగిలిన 50శాతం ఎరువుల కోసం ఎక్కడో దూరంగా పట్టణ, మండల కేంద్రాల్లోవున్న ప్రైవేటు డీలర్ల వద్దకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. దీనివల్ల సమయం, రవాణా ఛార్జీల భారం రైతులు ఎదుర్కొంటున్నారు. ఈనేపథ్యంలో స్థానికంగా ఎరువులు దొరకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే ప్రైవేటు డీలర్ల వద్దవున్న ఎరువులు గ్రామ స్థాయిలో పంపిణీ చేయాల్సి వుంటుంది. జిల్లాలో 280మంది ఎరువుల డీలర్లు ఉన్నారు. వీరంతా విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి, రాజాం, ఎస్.కోట వంటి పట్టణ కేంద్రాలకు పరిమితం కావడం వల్ల రైతులు వ్యయప్రయాసకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరోవైపు ఇటీవల విజిలెన్సు అధికారులు నిర్వహించిన తనిఖీల్లో చాలా షాపుల్లో అధిక ఎరువుల నిల్వలు ఉన్నట్లు గుర్తించారు.

జిల్లాలో పంటలన్నీ వ్యవసాయాధారంగానే సాగుతున్నాయి. ముమ్మురు ఉబాలు, లేదా కలుపు తీత సమయంలో ఎరువులు కోసం ప్రత్యేకంగా పట్టణాలకు వెళ్లి తెచ్చుకోవాలంటే ఎంత ఇబ్బందో వేరేగా చెప్పనక్కర్లేదు. ఈనేపథ్యంలో రైతు సేవ కేంద్రాల ద్వారా విక్రయించే ఎరువుల శాతాన్ని పెంచడం, లేదా ప్రైవేటు డీలర్లను గ్రామ స్థాయిలో ఎరువుల పంపిణీ చేసే విధంగా ప్రోత్సహించడం వంటి చర్యలు చేపట్టాల్సివుంది.

యూరియా కోసం రైతుల పాట్లు

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని సంకిలి రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం ఎరువుల పంపిణీలో రైతులు పాట్లు అన్నీ ఇన్నీ కావు. రైతు సేవా కేంద్రానికి 450 బస్తాల యూరియా రావడంతో తమ వరకు రావేమోనని రైతులు ఎగబడ్డారు. ఒకేసారి రైతులు రావడంతో తోపులాటలు జరిగాయి. ఎకరానికి ఒక బస్తా వ్యవసాయ అధికారులు ఇవ్వడంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. వన్‌బి, ఆధార్ కార్డు ఉన్నవారికే యూరియా బస్తాలు ఇస్తామని అనడంతో పరుగులు తీశారు. యూరియా పూర్తిస్థాయిలో వ్యవసాయ అధికారులు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతుబజారును తరలిస్తే ఉద్యమిస్తాం

రైతులకు అండగా ఉంటాం : సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాత ఆసుపత్రి వద్ద ఉన్న రైతు బజారును వేరే చోటకు తరలించి రైతులకు అన్యాయం చేస్తే రైతులతో కలిసి రైతుబజారును కాపాడుకునేందుకుఉద్యమిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ జిల్లా అధికార యంత్రాంగాన్ని హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత ఆసుపత్రి వద్ద ఉన్న రైతు బజారును, రైతులను అక్కడనుంచి తరలించేందుకు అధికార యంత్రాంగం చేస్తున్న చర్యలను ఖండించారు. 1999 నుంచి అక్కడ రైతు బజారు ఉందన్నారు. నగర ప్రజలకు అందుబాటులో ఉన్న ఈ స్థలం ఎమ్మెల్యే, అశోక్ గజపతిరాజు తమదని, ఈ భూమిని తమకిచ్చేయాలని అధికారులపై ఒత్తిడి చేయడం సరికాదన్నారు. విద్యా దాతలు, భూ దాతలు అని చెప్పుకొని ఈ విధంగా చేయడం తగదన్నారు. అద్దెలు కట్టుకొని, పన్నులు చెల్లించి కూరగాయలు అమ్ముకొని జీవనం సాగిస్తున్న వారి పొట్టకొట్టడం అన్యాయమన్నారు. జిల్లాకు పెద్దగా ఉన్న ఆయన ఈ విధంగా చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ల్యాండ్ సీలింగ్ వచ్చిన తర్వాత ప్రభుత్వ భూములు ఈ విధంగా లాగేసుకునే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ఎటువంటి నోటీసు ఇవ్వకుండా ఖాళీ చేయమని చెప్పడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. రైతు బజారును అక్కడే ఉంచాలని, లేదంటే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, వి.లక్ష్మి పాల్గొన్నారు.

రైతుల బతుకులు కూల్చడం న్యాయమా?

పాత మహారాజ ఆసుపత్రి వద్ద ఉన్న రైతు బజార్‌ను ఖాళీ చేయించి రైతుల బతుకులు కూల్చడం అశోక్‌గజపతిరాజుకు న్యాయమా అని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకర్రావు ప్రశ్నించారు. ఎమ్మెల్యేను రైతులు కలవగా అది తమ స్థలమని, అందుకే తీసుకుంటున్నామని బదులివ్వడం బాధాకరమని అన్నారు. కూల్చడం.. రైతుల బతుకులు రోడ్డు కి ఈడ్చడం ఇదేనా? కూటమి పాలన అని అన్నారు. ప్రశ్నించారు. శుక్రవారం రైతుబజారు వద్ద వినియోగదారులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ప్రభుత్వ స్థలం కాకపోతే మీరు లీజు రాసుకున్నారా అని ప్రశ్నించారు. అనంతరం ఎడి కార్యాలయానికి వెళ్లి వినతి అందజేశారు. ప్రత్యామ్నాయ స్థలం చూపించాల్సిన బాధ్యత, ఎమ్మెల్యేకు, అధికారులకు లేకపోవడం దారుణమన్నారు. ఎందుకు ఖాళీ చెయ్యాలో నోటీసు ఇవ్వాలన్న విషయాన్ని విస్మరించడం మార్కెటింగ్‌శాఖ ఎడికి తగదన్నారు. రైతు బజారును ఎత్తేస్తే 50కుటుంబాలు రోడ్డున పడతాయని, వినియోగ దారులు ఇబ్బంది పడతారని తెలిపారు. న్యాయం జరిగే వరకు పోరాడాతామని, వినియోగ దారులు, ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ, సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు రాము, చినబాబు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్, వినియోగ దారులు, రైతులు పాల్గొన్నారు.

రైతు బజారు తరలింపు

విజయనగరంకోట : పాత మహారాజా ఆస్పత్రి స్థలంలో ఉన్న రైతు బజారును ఈనెల 19 నుంచి రింగ్‌రోడ్డు రైతు బజారుకు తరలిస్తున్నట్లు మార్కెటింగ్‌శాఖ ఎడి బి.రవికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల సౌకర్యార్థం అక్కడి రైతు బజారులో తాత్కాలిక షెడ్‌లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించేవరకు అక్కడే కొనసాగుతారని తెలిపారు.

ఎవరికీ అన్యాయం జరగనివ్వం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎస్.కోటలో జిందాల్ అల్యూమినియం కంపెనీ ఏర్పాటుకు ప్రభుత్వం 2008లో తీసుకున్న భూములకు సంబంధించి ఎవరికీ అన్యాయం జరగనీయబోమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. 834.66 ఎకరాల అసైన్మెంటు భూమి, 151.04 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పట్లో సేకరించారని, ప్రభుత్వం భూమికి నష్ట పరిహారంగా ఎకరాకరు రూ.2.5లక్షలు, ప్రభత్వ భూమిపై వున్న అర్హత గల ఆక్రమణ దారులకు ఎకరాకు రూ.75వేలు చొప్పున పరిహారం మంజూరు చేసిందని తెలిపారు.


జిందాల్ కంపెనీ 180.73 ఎకరాల జిరాయితీ భూమిని రిజిస్టర్డు డాక్యుమెంటుల ద్వారా కొనుగోలు చేసుకుందని, వెరసి మొత్తం 1166.43 ఎకరాలు భూమి జిందాల్ అల్యూమినియం కంపెనీ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదించిందని తెలిపారు. డి- పట్టాలు కలిగిన 375 మంది అసైన్మెంటు దారులలో 332 మందికి నష్ట పరిహారంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. మిగిలిన 43మందిలో 15మంది అర్హత కలిగిన డి- పట్టాదారులుగా ఇటీవల కాలంలో గుర్తించి వారిలో ముగ్గురు ఆసాములకు నష్ట పరిహారం అందజేసినట్లు తెలిపారు. ఒక ఆసామి అర్హుడు అయినప్పటికీ అతని భార్య మరణించడం, వారికి వారసులు ఎవరూ లేనందున ఆ పరిహారాన్ని పభుత్వ పరం చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా వారి వారసులు అర్హత కల్గి వుండి , దరఖాస్తు చేస్తే పరిహారం మంజూరు చేస్తామని తెలిపారు.

మిగిలిన 11 మంది ప్రస్తుత భూ సేకరాణ చట్ట ప్రకారం పరిహారం ఇప్పించాలని ఎస్.కోట తహశీల్దారుకు దరఖాస్తు చేశారని, ప్రస్తుతం భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం ఇచ్చుటకు అవకాశం లేదని తెలిపారు. అసైన్మెంటు దారులు, అర్హులైన ఆక్రమణ దారులు , నష్టపోయిన పక్కా ఇళ్ల యజమానులు , వ్యవసాయ బోరుల యజమానులు ఎవరైనా అర్హత కలిగి నష్ట పరిహారం అందాల్సి ఉంటే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

26న గోవా గవర్నర్‌గా అశోక్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈనెల 26న గోవా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు టిడిపి సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్‌గజపతిరాజు తెలిపారు. సింహాచలంలో అప్పన్నస్వామిని దర్శించుకున్న అనంతరం పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించిన ఆయన అనంతరం విజయనగరంలోని తన బంగ్లాలో విలేకర్లతో మాట్లాడారు. ప్రమాణ స్వీకారానికి గోవా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. ఈమేరకు గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావత్‌తో మాట్లాడినట్లు చెప్పారు. ప్రమాణ స్వీకారం విషయం రాజ్ భవన్‌కు, కేంద్ర హోంశాఖకు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కూడా తెలియజేశామన్నారు. అంతకుముందు తన కుటుంబ సభ్యుల సునీలా గజపతి రాజు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి రాజుతో కలిసి సింహాచలం అప్పన్నస్వామిని దర్శించుకున్నారు. అనంతరం టిడిపి శాశ్వత సభ్యత్వానికి, పార్టీ పొలిట్‌బ్యూరో పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన రాజీనామాను ఆమోదించాలని టిడిపి అధినేత చంద్రబాబును కోరినట్లు తెలిపారు.



అశోక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి శ్రీనివాస్

అశోక్ గజపతిరాజును కలసిన మంత్రి కొండపల్లి

అశోక్‌గజపతిరాజును రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి ఉంటూ పార్టీ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని అన్నారు. కేంద్ర మంత్రిగా ఆయన తీసుకున్న సంస్కరణలు నేడు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. దేశ రాజకీయాల్లో వారికంటూ ప్రత్యేక స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, మాజీ ఎంపిపి కొండపల్లి కొండబాబు, ఎఎంసి చైర్మన్ కర్రోతు నర్సింగరావు, నెల్లిమర్ల టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్, కంది చంద్రశేఖర్, విజయనగరం పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, రాజేష్ బాబు తదితరులు ఉన్నారు.

2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

కలెక్టరేట్ వద్ద ధర్నా ● మద్దతు తెలిపిన ఉపాధ్యాయ సంఘాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులు ఫోరం ఆధ్వర్యంలో పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ఫోరం జిల్లా కన్వీనర్ సూర రవికుమార్ మాట్లాడుతూ దేశంలోని 16 రాష్ట్రాలు 1-9-2004కు ముందు నోటిఫై అయిన పోస్టులకు మెమో 57 ప్రకారం పాత పెన్షన్ అమలు చేసాయని, అదే విధంగా మన రాష్ట్రంలో కూడా 11వేల ఉద్యోగ ,ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. ఇప్పటికే మన రాష్ట్రంలో జీవో 2140, ప్రకారం ముగ్గురు ఐఎఎస్‌లకు మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానం పునరుద్ధరించారన్నారు. కాని దిగువ తరగతికి చెందిన ఉద్యోగులకు కూడా మెమో 57 అమలు చేసి న్యాయం చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు వినతినిచ్చారు. ప్రధాన కార్యదర్శి జి.కాశీ విశ్వనాథం, కార్యదర్శులు జి. నారాయణరావు, కె. సింహాచలం, కె.చక్రధర్ మాట్లాడుతూ ప్రభుత్వం తమ డిమాండ్‌ను పరిగణలోకి తీసుకొని న్యాయం చేయాలని, లేకుంటే న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామన్నారు. ధర్నాకుఉపాధ్యాయ సంఘాల నాయకులు ఫ్యాప్టో చైర్మన్ పి.శ్రీనివాసరావు , యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, సీనియర్ నాయకులు కె.విజయగౌరీ, పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాసరావు, ఎపిటిఎఫ్ 257 నాయకులు బంకురు జోగినాయుడు, ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాసరావు, ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి డి.శ్యామ్. శ్యామ్ , పిటిఎ నాయకులు పి. రామారావు పాల్గొని మద్దతు తెలిపారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.విజయగౌరి

'అక్షర ఆంధ్రా'తో శతశాతం అక్షరాస్యత

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

అక్షర ఆంధ్రా కార్యక్రమం ద్వారా జిల్లాలో శతశాతం అక్షరాస్యతను సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఉల్లాస్‌లో భాగంగా చేపట్టిన అక్షరాంధ్ర ప్రత్యేక కార్యక్రమం ద్వారా దశలవారీగా జిల్లా ప్రజలందరినీ అక్షరాస్యులను చేయాలని సూచించారు. దీనిలో భాగంగా మొదటి విడత సుమారు లక్షన్నర మందిని అక్షరాస్యులను చేసేందుకు ప్రణాళికను రూపొందించాలని అన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ తమ ఛాంబర్లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉపాధిహామీ వేతనదారులు, వెలుగు, మెప్మా మహిళా సంఘాల సభ్యులు, అంగన్వాడీ ఆయాలు, ఆ శాఖ ద్వారా లబ్ది పొందుతున్న గర్భిణులు, బాలింతల్లో నిరక్షరాస్యులను గుర్తించి, వారిని అక్షరాస్యులను చేయాలని సూచించారు. ఈనెల 26లోగా నిరక్షరాస్యుల జాబితాను రూపొందించాలని అన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ఎంపిడిఒ ఆధ్వర్యంలో ఎపిఒ, సిడిపిఒ, ఎంఇఒలు సభ్యులుగా మండల కమిటీలను ఈ నెల 26లోగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వలంటీర్ల ఎంపికను త్వరగా పూర్తిచేసి, వారికి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పారు. అంగన్వాడీ కార్యకర్తలను సైతం వలంటీర్లుగా నియమించే అంశాన్ని పరిశీలించా లని కలెక్టర్ సూచించారు. సమావేశంలో వయోజనవిద్య ఇన్‌ఛార్జి డిడి ఎస్.సుబ్రమణ్యవర్మ, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిఆర్‌డిఎ ఇన్చార్జి పీడీ కె.సావిత్రి, డిఇఒ మాణిక్యంనాయుడు, ఐసిడిఎస్ పీడీ టి.విమలారాణి, డ్వామా పీడీ శారదాదేవి, జిఎస్‌డబ్ల్యూఒ జిల్లా కోఆర్డినేటర్ రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు కాస్మోటిక్ కిట్లు

మెనూ కచ్చితంగా అమలు చేయాలి : జిల్లా గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు



ప్రజాశక్తి - విజయనగరంటౌన్

జిల్లాలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ ఏడాది నుంచి కాస్మెటిక్స్ ఛార్జీలకు బదులుగా కాస్మోటిక్ కిట్లను పంపిణీ చేయనున్నామని జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి కె.శ్రీనివాస రావు చెప్పారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ జిల్లాలో తమ శాఖ పరిధిలో 19 గిరిజన పాఠశాలలున్నాయని వీటిలో సుమారు 5వేల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. వీరందరికీ జిసిసి ద్వారా కొనుగోలు చేసిన కాస్మోటిక్ కిట్లు అందజేస్తామన్నారు. జిల్లాలో పాఠశాలలను సందర్శించి సంబంధిత ప్రధానోపాధ్యాయులకు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు ఖచ్చితంగా మెనూ అమలు చేయాలని సూచించామన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి పదో తరగతి విద్యార్థులకు 100శాతం ఉత్తీర్ణత గురించి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకొని బోధన చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. పాఠశాల పరిసరాలు, టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వంటగది, డైనింగ్ హాల్, పాఠశాల పరిసరాలు, స్టాక్ రూమ్ సందర్శించి వారికి సూచనలు ఇస్తున్నామని చెప్పారు.

మైన్స్‌ల లీజును పునరుద్ధరించాలి

మంత్రికి సిఐటియు వినతి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

గరివిడి మండలం సదానంద పురం, దేవాడ మైన్స్‌ల లీజును పునరుద్ధరించి కార్మికుల ఉపాధిని కాపాడాలని విజయనగరం జిల్లా మైన్స్ వర్కర్స్ యూనియన్స్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు టివి రమణ, జిల్లా మైన్స్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.విశ్వనాథరాజు, జిల్లా అధ్యక్షులు గౌరి నాయుడు, ప్రధాన కార్యదర్శి పి అప్పలనాయుడు మాట్లాడుతూ గుర్ల మండలం సదానందపురం మైన్స్ లీజు 2025 సెప్టెంబర్ 14 తో ముగుస్తుందని తెలిపారు. 2024 జనవరి 23 నుంచి గరివిడి మండలం దేవాడ మైన్స్ పూర్తి అయిందని, ఈ మైన్స్ లోనూ దీని ఆధారంగా పనిచేస్తున్న 553 మంది కార్మికులను సెప్టెంబర్ 15 నుంచి తొలగిస్తున్నట్లు యాజమాన్యం ఈనెల 16న నోటీసు ఇచ్చిందని తెలిపారు. చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలో గల మైన్స్ లో గరివిడి, గుర్ల మండలాలకు చెందిన దేవాడ, నాగళ్ళ వలస, తోనంగి, సదానంద పురం, దుమ్మిది, దువ్వాం, గరివిడి, తాటిగూడ, జమ్మూ గొలగాం, పర్ల, తదితర గ్రామాల చెందిన వారు 1975 నుండి ప్రత్యక్షంగా వెయ్యి మంది, పరోక్షంగా 10వేల మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. చీపురుపల్లి నియోజకవర్గం గరివిడి, గుర్ల ప్రాంతంలో ఇంత పెద్ద మొత్తంలో ఉపాధి చూపే ఈ మైన్స్ లీజు ను పునరుద్ధరించకపోతే కార్మికులంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడతారని వివరించారు. వెంటనే మంత్రి కలుగజేసుకొని సదానంద పురం దేవాడ మైన్స్ లీజులను పునరుద్ధరించి కార్మికుల ఉపాధిని కాపాడాలని కోరారు.



మంత్రి శ్రీనివాస్‌కు వినతి అందిస్తున్న సిఐటియు నాయకులు

వాయు కాలుష్య రహిత నగరంగా విజయనగరం

పచ్చదనం పెంచడానికి చర్యలు : కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరాన్ని వాయు కాలుష్యం లేని పట్టణంగా తీర్చి దిద్దడానికి కృషిచేయాలని జిల్లా అధికారులకు కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. నగరంలో వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం తన ఛాంబర్‌లో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌సిఎపి కింద పార్కుల, రహదారుల అభివృద్ధికోసం జిల్లాలో 14 పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపగా రూ.2.84కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, అందులో నుండి 2024-25 ఆర్థిక సంవత్సరానికి 12పనులకు రూ.71లక్షలు విడుదల చేసిందని తెలిపారు. ఈ నిధులతో విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 4 పార్కులను అభివృద్ధి చేసేందుకు బిటి రోడ్లు, ఉద్యాన వనాల పెంపకం, డ్రైనేజీలు, ఫుట్ పాత్‌ల అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే టెండర్లు పిలిచినట్లు తెలిపారు. వాహనాల ద్వారా వెలువడే వాయు కాలుష్యాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని, అందుకోసం మెప్మా వారి ద్వారా మొబైల్ పొల్యూషన్ చెకింగ్ వాహనాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు చెట్లను కొట్టేటప్పుడు కొమ్మలను మాత్రమే నరకాలని, పూర్తిగా చెట్లను తొలగించకూడదని అన్నారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సరిత, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, పరిశ్రమల శాఖ జిఎం కరుణాకర్, విద్యుత్ శాఖ ఎస్‌ఇ లక్ష్మణరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి మధుసూదనరావు, జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావు, ఉద్యానశాఖ డిడి చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

జిందాల్ చుట్టూ పోలీస్ పాలన : సిపిఎం

శృంగవరపుకోట : జిందాల్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతుంటే పట్టించుకోకుండా, చట్టం పేరుతో పోలీస్ పాలన సాగించడం దారుణమని సిపిఎం నాయకులు చల్లా జగన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం బొడ్డవరలో జిందాల్ భూనిర్వాసితులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసి, నిర్బంధ పాలనను జిందాల్ చుట్టూ అమలు చేయడం దారుణమన్నారు. జిందాల్ నిర్వాసితుల ఉద్యమాన్ని అణచివేసేందుకు సెక్షన్ 30 అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రజల తరపున నిలబడితే పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేస్తారా? అని ప్రశ్నించారు. నిర్వాసితులు కనీసం హైవే అంచు తాకినా పోలీస్ వలయం చుట్టుముడుతోందని మండిపడ్డారు.

పలువురికి కారుణ్య నియామకాలు

కంటోన్మెంట్ : వేపాడలో బయాలజీ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ మరణించిన డి.కన్నయ్య కుమారుడు సింహాచలం దొరకు కారుణ్య నియామకం కింద వియ్యంపేట జెడ్‌పిహెచ్‌స్‌లో సహాయకులుగా జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు నియమించారు. ఈమేరకు తన కార్యాలయంలో నియామకపత్రాన్ని అందజేశారు. మెరకముడిదాం ఎంపిడిఒ కార్యాలయ సహాయకులు టి.రాములును అక్కడి హైస్కూలులో ల్యాబ్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పించారు. బలిజిపేట జెడ్‌పిహెచ్‌సి ల్యాబ్ అసిస్టెంట్ జి.ప్రమీలను పాల్తేరు పాఠశాల రికార్డు సహాయకులుగా, విజయనగరం ఎంపిపి స్కూలులో పనిచేస్తున్న కె.శ్రీనివాసరావును పాచిపెంట హైస్కూలు రికార్డు అసిస్టెంట్‌గా నియమించారు. సిఇఒ సత్యనారాయణ, ఎఒ రాజేశ్వరి పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో సత్తా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 12, 13వ తేదీలలో విశాఖపట్నం రైల్వే స్టేడియంలో జరిగిన 6 వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో విజయనగరం క్రీడాకారులు పతకాలు సాధించారు, బి.సచి బంగారు పతకం, ఎన్.దేవకీ సిల్వర్ మెడల్, వి.జాహ్నవి ,సిల్వర్ మెడల్, పి.లోకేష్, పి.దుర్గా ప్రసాద్, కె.వర్ధన్, అర్.యశ్వంత్, బి.గౌతమ్ గణేష్ కాంస్య పతకాలు సాధించారు. బంగారు పతాకం సాధించిన, బి.సచిన్ వచ్చేనెల ఆగస్టు 7 నుండి 14 వరకు ఉత్తరప్రదేశ్ నోయిడాలో సబ్ జూనియర్స్ జాతీయ స్థాయి పోటీలలో మన రాష్ట్ర జట్టులో పాల్గొంటారు పతాకాలు సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు గరే శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఇందుకూరి అశోక్ రాజు, ఆర్గనైజర్ సెక్రెటరీ ఎస్ఇ రాజు, రాకేష్ కుమార్, మహబూబ్ షరీఫ్, బి.మనీష్, జిల్లా శాప్ కోచ్ బి.ఈశ్వరరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని, ఈ నెలలోనే మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేయాలని పిసిసి అధ్యక్షులు మరిపి విద్యా సాగర్ ఆ పార్టీ నాయకులకు సూచించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వర్షాకాలం కారణంగా జిల్లాలో రోడ్లు, కాలువలను బాగు చేయాలని అధికారులను కోరారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించాలన్నారు. సాగునీటి కాలువల్లో పూడికలు తీయించి రైతులకు సకాలంలో సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రెండో రోజుకు పారిశుధ్య కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - లక్కవరపుకోట

సమస్యల పరిష్కారానికి పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె గురువారం రెండోరోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని శుక్రవారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో పారిశుధ్య కార్మికులకు సుమారు 9 నెలల నుంచి ప్రభుత్వం జీతాలు చెల్లించకుండా, బకాయిలు ఇవ్వకుండా ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. నిరుపేద కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి సరికాదన్నారు. మండల పంచాయతీ విస్తరణ అధికారి ఈ శిబిరాన్ని సందర్శించి ప్రభుత్వ నిధులు మంజూరు కాగానే ఖాతాలో జమ చేస్తామని సమ్మె విరమించాలని కోరినప్పటికీ కార్మికులు అంగీకరించలేదు. ప్రభుత్వం స్పందించి పారిశుధ్య కార్మికులకు, క్లాప్ డ్రైవర్లకు పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న అన్ని రకాల కార్మికులకు బకాయిలు చెల్లించాలని నాయకులు కోరారు. లేదంటే సమ్మె విరమించేది లేదని అన్నారు. జిల్లా వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, సిఐటియు నాయకులు టి.వెంకటరమణ, రమేష్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతుల్లో జాప్యం తగదు

విజయనగరంకోట : ఆర్‌టిసి (పిటిడి) ఉద్యోగులకు గత ఆరేళ్లుగా పెండింగులో ఉంచిన ఉద్యోగోన్నతులను ప్రభుత్వం వెంటనే కల్పించాలని ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్‌టిసి ఇయు జిల్లా కార్యవర్గసమావేశం జిల్లా అధ్యక్షులు కె.కె.రావు అధ్యక్షతన జరిగింది. ఉప ప్రధానకార్యదర్శి పి.భానుమూర్తి మాట్లాడుతూ ఇహెచ్‌యస్ ద్వారా కనీస వైద్య సౌకర్యాలు కూడా అందడం లేదన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి

రామభద్రపురం : అసంపూర్ణంగా ఉన్న గృహ నిర్మాణాలు వెంటనే పూర్తిచేయాలని హౌసింగ్ ఎఇ మత్స వెంకటేష్ తెలిపారు. మండల పరిధిలోని బూసాయవలస, రామభద్రపురంలో జగనన్న కాలనీలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 2045 ఇళ్లు మంజూరయ్యాయని, ఇప్పటి వరకు 1514 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారని తెలిపారు. మిగిలిన 531 ఇళ్లు ఈ నెలాఖరులోగా పూర్తి కావాలన్నారు. ఇప్పటి వరకు ఇళ్లులేని వారు సచివాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నిక

గంట్యాడ : పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం గంట్యాడ యూనిట్ ఎన్నికలు శుక్రవారం మండల కార్యాలయంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కౌన్సిలర్ ఎల్ వి ప్రసాద్, నాయకులు ఎ.రమణమూర్తి వ్యవహరించారు నూతన కార్యవర్గం అధ్యక్షులుగా ఎస్.మోహన్ కుమార్, ఉపాధ్యక్షులుగా కె. హేమ సుందర్, కార్యదర్శిగా జిజివిఎస్ జి ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా వి సూర్యనారాయణ, కోశాధికారిగా బి.సత్యవేణి, జిల్లా కౌన్సిలర్లుగా పి సాయిగోపాల్, ఆర్.వెంకటేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమములో ఎపిపిఆర్ఎంఇఎ జిల్లా అధ్యక్షులు సిహెచ్ మురళి, ఎపిఎన్‌జిఒ జిల్లా కార్యదర్శి ఆవు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

నెల్లిమర్ల : మండలంలోని కొండవెలగాడకు చెందిన రాములమ్మ అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. వారిది నిరుపేద కుటుంబం. దీంతో ఆమె దహన సంస్కారాలకు తెలుగు యువత నాయకులు అజయ్‌బాబు ఆధ్వర్యాన కెవిడి యువత రూ.10 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కెవిడి యువత సభ్యులు మొయిద సత్యనారాయణ, బొంతు మహేష్, రామచంద్ర మాస్టర్, చిన్న మాస్టర్, చల్ల రాము, జి.ఈశ్వరరావు, బట్టు లక్ష్మణరావు, బి.వి.రమణ, ఎ.శ్రీను, ఎస్.గౌరిబాబు, జి.సూరిబాబు, బి.నరసయ్య పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ప్రణాళికలు

కొత్తవలస : పేదరికం నిర్మూలన దిశగా ప్రణాళికలు రూపొందించాలని ఎపిఎం ఎ.వెంకటరమణ అన్నారు. స్థానిక మండల సమాఖ్యలో ఎస్‌హెచ్‌జి సభ్యులకు శుక్రవారం ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రణాళికల తీర్మానాలను అక్టోబర్ 2న జరిగే గ్రామసభల్లో ఆమోదించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరావు, సిసిలు అప్పలనాయుడు, అప్పలస్వామి, భారతి, పద్మ పాల్గొన్నారు.

సికెఎం కళాశాలలో శక్తి టీం ఏర్పాటు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసుల ఆధ్వర్యంలో శక్తి టీం ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆ కళాశాలలో మహిళల భద్రత కోసం శక్తి టీం ఏర్పాటు చేసి, పనితీరు, వారి బాధ్యతలపై ఎస్ఐ బి.గణేష్ సమావేశం నిర్వహించి, అవగాహన కల్పించారు.

అప్పన్నకు పరామర్శ

చీపురుపల్లి : అనారోగ్యంతో బాధపడుతూ స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎఎంసి మాజీ డైరెక్టర్ సింహాల అప్పన్నను వైసిపి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస్ నాయుడు శుక్రవారం పరామర్శించారు. అప్పన్నకి అందుతున్న వైద్యం, ఆయన ఆరోగ్యం గురించి అక్కడున్న వైద్యులను శ్రీనివాస్ నాయుడు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గవిడి సురేష్, కోరుకొండ దాలయ్య, ప్రభాస కుమార్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

సోంపురం పాఠశాల సందర్శన

వేపాడ : మండలంలోని సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను శుక్రవారం ఎంఇఒ పి.బాలభాస్కరరావు సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, వారి ప్రతిభను పరీక్షించారు. స్టడీ హవర్స్‌కు హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు ప్రదానం

విజయనగరం కోట : ఎపిఎస్ ఆర్‌టిసి హెవీ వెహికల్స్ డ్రైవర్ల శిక్షణ 22వ బ్యాచ్ శిక్షణ పూర్తి కావడంతో శుక్రవారం ప్రజా రవాణా అధికారి వరలక్ష్మి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా డిపిటిఒ మాట్లాడుతూ శిక్షణ పొందినవారు ఆర్టీసీ పేరు నిలబెట్టేలా పనిచేయాలనికోరారు. త్వరలో ప్రారంభం కానున్న 23వ బ్యాచ్‌లో చేరదలచిన వారు డ్రైవింగ్ స్కూల్ శిక్షకులు డిఎన్‌రాజును సంప్రదించాలని తద్వారా ఉపాధి అవకాశాలను మెరుగు పరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జె. శ్రీనివాసరావు, డ్రైవింగ్ శిక్షకులు డిఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సీతంలో డిజిటల్ మోసాలపై అవగాహన సదస్సు

విజయనగరంటౌన్ : సీతం ఇంజినీరింగ్ కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం డిజిటల్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్తగా ఐసిఐసిఐ బ్యాంకు అకౌంట్స్ మేనేజర్ వివేక్ చౌదరి హాజరై డిజిటల్ మోసాల ప్రబలమైన విధానాలు, ఆపదల నుండి ఎలా రక్షించుకోవాలో వివరించారు. డిజిటల్ యుగంలో సైబర్ మోసాలు వేగంగా పెరుగుతున్నాయని, వ్యక్తిగత డేటా రక్షణ, పాస్‌వర్డ్ భద్రత, డిజిటల్ లావాదేవీల పట్ల జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కళాశాల డైరెక్టర్ లిలిమజ్జి శశిభూషణరావు గారులిలి మాట్లాడుతూ, 'ప్రపంచం డిజిటలైజేషన్ వైపుగా వేగంగా పోతున్న తరుణంలో, యువత డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.వి. రామమూర్తితదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

గంట్యాడ : మండలంలోని పెద్దమజ్జిపాలెం పిహెచ్‌సి పరిధిలోని గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారు. శుక్రవారం బోనంగి గ్రామంలో ఎస్‌సి కాలనీలో కాలువల్లో, నీటి నిల్వలున్న చోట గంబూషియా చేపపిల్లలను విడిచిపెట్టారు. పిహెచ్‌సి వైద్యాధికారులు పల్లవి, సతీష్, మలేరియా నివారణ అధికారి మణి, ఎస్.కోట సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, ఆరోగ్య సహాయకులు ఈశ్వరరావు, ఇఒ రాజ్, సూపర్‌వైజర్ తిరుపతి పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కెకి రోడ్డేది?

ప్రజాశక్తి-వేపాడ



దారిలేని ఆర్ఎస్‌కె భవనం ఇదే

ఈ చిత్రంలోని భవనం.. కుంపల్లి గ్రామంలోని రైతు సేవా కేంద్రం. వర్షాకాలంలో ఈ కార్యాలయానికి వెళ్లేందుకు మార్గం ఉండదు. ఇక్కడి సిబ్బంది సచివాలయంలో విధులు నిర్వహించాల్సిందే. ఎందుకంటారా..? రైతు సేవా కేంద్రం భవనమైతే నిర్మించారు, కానీ రహదారిని ఏర్పాటు చేయలేదు. ఈ భవనం చుట్టూ మురుగునీటి కూపం ఉంది. చూసేందుకు పచ్చికలా కనిపిస్తున్నా, కింద ఉన్నదంతా మురుగునీరే. కనీసం నడిచి వెళ్లడానికి కూడా మార్గం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఆర్ఎస్‌కె సిబ్బంది సచివాలయానికి పరిమితం అవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్ఎస్‌కెకు రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


డ్రగ్స్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం

'సంకల్పం'లో సినీ నటుడు సుమన్, డిఐజి గోపినాథ్

ప్రజాశక్తి-బొబ్బిలి

డ్రగ్స్ రహిత సమాజాన్ని స్థాపించేందుకు ప్రజలు ముందుకు రావాలని సినీ నటుడు సుమన్, విశాఖ రేంజ్ డిఐజి గోపినాథ్ జట్టి పిలుపునిచ్చారు. స్థానిక టిబిఆర్ థియేటర్‌లో శుక్రవారం డ్రగ్స్ నివారణకు సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటు పడితే తెలియకుండానే నేరాలు చేస్తారన్నారు. డ్రగ్స్ వల్ల కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడతారని తెలిపారు. జీవితంలో ఉన్నంత వరకు అభిమానం, ప్రేమతో ఉంటూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. డిఐజి గోపినాథ్ జట్టి మాట్లాడుతూ డ్రగ్స్ నివారణలో రాష్ట్రంలో విశాఖ రేంజ్ ముందుంటే, రేంజ్ పరిధిలో విజయనగరం జిల్లా ముందుందన్నారు. ఆంధ్రా-ఒడిశా బోర్డర్, అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి సాగు 7550 ఎకరాల నుంచి ప్రస్తుతం 93.5 ఎకరాలకు తగ్గిందన్నారు. డ్రోన్ల సహాయంతో గంజాయి సాగును గుర్తించి ధ్వంసం చేశామన్నారు. 45 రకాల పంటలు 25 వేల ఎకరాలలో సాగు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గంజాయి రవాణా నివారణకు 29 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. గంజాయి కేసులో నిందితుల ఆస్తులను సీజ్ చేస్తున్నామని చెప్పారు.

ఎమ్మెల్యే బేబినాయన మాట్లాడుతూ డ్రగ్స్ సేవించిన, అమ్మిన వారి వివరాలు పోలీసులకు ఇచ్చి డ్రగ్స్ నివారణకు సహకరించాలని కోరారు. ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ విద్యార్థులు కాలేజీ మెట్లు ఎక్కిన తర్వాత డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా చేసే పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ సిఐ కె.సతీష్



ప్రతిజ్ఞ చేస్తున్న సినీ నటుడు సుమన్, డిఐజి గోపినాథ్, ఎమ్మెల్యే, ఎస్‌పి

కుమార్, పట్టణ ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుమన్‌కు ప్రత్యేక తపాలా చంద్రిక

ప్రత్యేక తపాలా చంద్రికను బొబ్బిలి రోటరీ క్లబ్ ఆధ్వర్యాన సినీ నటుడు సుమన్‌కు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ జిల్లా అధ్యక్షులు జెసి రాజు, సర్వీస్ చైర్ గెంబలి శ్రీనివాసరావు, సభ్యులు బొబ్బిలి ఎస్‌టిఒ వెంకట పద్మనాభం, సిఎజె సిహెచ్ నారాయణమూర్తి పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మత్తు పదార్థాల వినియోగం ప్రమాదకరమని ఎక్సైజ్ ఎస్ఐ దస్తగిరి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈగల్ క్లబ్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ కేశవరావు అధ్యక్షతన విద్యార్థులకు గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్ భాస్కరరావు, ఈరన్న, సుధీర్, ప్రభాకర్‌రావు, శ్రీలక్ష్మి, శ్రీనివాసరావు, రామకృష్ణ, లక్ష్మణరావు, దివ్య పాల్గొన్నారు.

సుపరిపాలనే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యేలు బేబినాయన, కళావెంకటరావు



బాడంగి.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ లక్ష్మునాయుడు

ప్రజాశక్తి-బాడంగి

ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని పెదపల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలకు ఏ లోటూ రాకుండా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వారన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, బొంతు త్రినాథ్, సత్యం, సర్పంచ్ ఆవు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందుతోందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. మండలంలోని రామలింగాపురంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. అనంతరం ఉపాధి హామీ నిధుల నుండి సుమారు 20 లక్షల వ్యయంతో నిర్మాణం చేసిన సిసి రోడ్డు, కాలువలను ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రౌతు కాము, దన్నాన రామచంద్రుడు, పురాయివలస గ్రామ సర్పంచ్ సారిక మోహన్ రావు, రామలింగాపురం సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జ్ ఇప్పిలి సురేష్ పాల్గొన్నారు.

సంతకవిటి : మండలంలోని ఎం.ఆర్ అగ్రహారం గ్రామంలో టిడిపి నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షులు వల్లూరు గణేశ్, ఎస్‌సి సెల్ అధ్యక్షులు మన్నేన రమేష్, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు భవిరి శ్రీనుబాబు కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు.

బాబు పాలనలో మోసం గ్యారెంటీ

మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రస్తుత చంద్రబాబు పాలనలో ప్రజలకు ష్యూరిటీ లేకపోగా మోసం మాత్రం గ్యారెంటీ అని వైసిపి నాయకులు, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శుక్రవారం రెండవ డివిజన్ పూల్‌బాగ్ కాలనీ నుండి 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు ఇస్తామని చంద్రబాబు ఎన్నికల ముందు కల్లబొల్లి కబుర్లు చెప్పారన్నారు. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని ఇంతవరకు ఇవ్వలేదన్న నిజాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. సంక్షేమ పథకాలు అమలు తీరు ఎలా ఉందో గత ప్రభుత్వ పాలనతో పోల్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పాల్గొన్నారు.

చంద్రబాబు అంటేనే మోసం

దెంకాడ : చంద్రబాబు అంటేనే మోసం, అబద్ధమని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు వ్యాఖ్యానించారు. బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మండలంలోని మోపాడ, గొలగాం, గొడ్డుపాలెం, అక్కివరం, బంటుపల్లి, గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపు మాటలు, కుటిల ఎత్తులతో రాజకీయం చేయడమే చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్యని ఎద్దేవా చేశారు. ఏడాది పాలనలోనే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఏడాది పాలన గొప్పగా చేశామని గ్రామాల్లో కూటమి నాయకులు తిరుగుతున్నారని చెప్పారు. కూటమి నాయకులు గ్రామాల్లోకి వస్తే ఇచ్చిన హామీలు అమలు చేయాలని నిలదీయాలని కోరారు. అనంతరం ఆయా



దెంకాడ.. మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలు, అబద్ధపు హామీల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పిన్నింటి తమ్మునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు లంక లక్ష్మణరావు, నాయకులు పతివాడ కృష్ణవేణి, రేగాన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు చెప్పండి

బొబ్బిలి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు వైసిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ రూరల్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమిని గెలిపిస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేశారని విమర్శించారు. మండలంలోని ప్రతి గ్రామంలోనూ బాబు షూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, రెడ్డి దామోదర్, తదితరులు పాల్గొన్నారు.



రోగులకు ఫుడ్ బాస్కెట్లు పంపిణీ చేస్తున్న డిఎంహెచ్‌ఒ జీవనరాణి

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

కొండవెలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డిఎంహెచ్‌ఒ ఎస్.జీవనరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలు ఎలా అమలవుతున్నాయో? అని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మందులు నిల్వ గదిని పరిశీలించి యువిన్ పోర్టల్, ఇహెచ్‌ఆర్, టెంపరేచర్ రిజిస్టర్ తనిఖీ చేశారు. వ్యాక్సిన్ నిర్వహణపై ఫార్మాసిస్టుకు ఆదేశాలు ఇచ్చారు. స్టాఫ్‌నర్స్‌తో ఇహెచ్‌ఆర్ ప్రోగ్రాంపై మాట్లాడి నమోదు సంఖ్యను పెంచాలని సూచించారు. అనంతరం ఆమె క్షయ రోగులకు ఫుడ్ బాస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.వి.శిరీష, సిసి రాజు, అనిల్, ఎంహెచ్‌ఒ జి.అప్పలనాయుడు, మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జామి మండలంలోని వెన్నె పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై ఇఒపిఆర్‌డి ఉమ శుక్రవారం విచారణ చేపట్టారు. పంచాయతీ నిధులను గ్రామ స్థాయి అధికారులు దుర్వినియోగం చేసినట్లు గ్రామానికి చెందిన రంధి భాస్కరరావు ఈ నెల 6న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుచేశారు. ఈ మేరకు ఇఒపిఆర్‌డి ఉమ.. పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. త్వరలో నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. అండర్ అసెస్మెంట్, ఆన్ అసెస్మెంట్ ఇళ్లను గుర్తించి పన్నులు వేయాలన్నారు. సమావేశంలో ఆర్‌ఒ నాగరాజు, ఆర్ఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారులకు నిధులు మంజూరు

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలో కొత్తగా మూడు రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు వివిధ అభివృద్ధి పనుల కింద కోట్లాది రూపాయల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. తాజాగా కొండకెంగువ నుంచి జీలికవలసకు వెళ్లే రహదారికి రూ.1.80 కోట్లు, ఆరికతోట జాతీయ రహదారి నుంచి నర్సాపురం వెళ్లే రహదారి కోసం రూ.50 లక్షలు, ఆరికతోట పెట్రోల్ బంకు నుంచి శ్మశాన వాటిక మీదుగా రహదారికి రూ.80 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలోనే టెండర్లు పిలవనున్నారని తెలిపారు.

శ్మశానంలో షెడ్ తొలగింపుపై విచారణ

ప్రజాశక్తి -పూసపాటిరేగ

మండలంలోని కొవ్వాడ గ్రామంలో శ్మశాన వాటిక వద్ద ఉన్న క్రిమిలేయర్ షెడ్ తొలగింపు వివాదంపై శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ఎంపిడిఒ ఎం.రాధిక ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఉపాధిహామీ నిధులతో నిర్మించిన క్రిమిలేయర్ షెడ్‌ను అనుమతులు లేకుండా ఎవరు తొలగించారని కార్యదర్శిని ఎంపిడిఒ ప్రశ్నించారు. శ్మశానంలో షెడ్డు తొలగింపునకు గత ఏడాది జనవరిలో పంచాయతీ తీర్మానించిందని, కానీ షెడ్డు ఎప్పుడు తొలగించారో తనకు తెలీదని కార్యదర్శి తెలిపారు. సర్పంచ్ కోట్ల రఘు మాట్లాడుతూ బిసిల శ్మశానంలో షెడ్డు ఈశాన్యంలో ఉందని, దానివల్ల అకాల మరణాలు సంభవించాయనే భయం గ్రామస్తుల్లో ఉందన్నారు. శ్మశానం షెడ్డు ఈశాన్యంలో తొలగించి పక్కన కట్టాలని పంచాయతీ తీర్మానించినా నిధుల్లేక అధికారులకు పంపలేదన్నారు. మూడు నెలల క్రితం శ్మశానంలో తన సొంత నిధులతో బోరు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. అనంతరం గ్రామస్తులు ఆ శిథిలావస్థలో ఉన్న షెడ్ తొలగించినట్లు తెలుస్తోందన్నారు. ఈ విషయమై గ్రామంలో నలుగురు వ్యక్తులు తనపై రాజకీయ దురుద్దేశంతో షెడ్డు తొలగించినట్లు ప్రచారం చేసి, ఫిర్యాదు చేశారన్నారు. గ్రామస్తులు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. గ్రామసభకు ఫిర్యాదుదారులు హాజరుకాకపోవడంతో ఎంపిడిఒ అసహనం వ్యక్తం చేశారు. గ్రామస్తుల భయాందోళనల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారని ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఎంపిడిఒ తెలిపారు.

నకిలీ ఎస్ఐ అరెస్టు

ప్రజాశక్తి - సంతకవిటి

సంతకవిటి ఎస్ఐ పేరుతో రూ.97 వేలు దోచుకున్న నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ ఆర్.గోపాలరావు కథనం ప్రకారం.. బాపట్లకు చెందిన అంకెం మోజేష్ (26) మత్తు పదార్థాలకు, విలాసాలకు అలవాటు పడ్డాడు. ఆన్‌లైన్‌లో సులువుగా డబ్బులు ఎలా సంపాదించాలో పలు వీడియోలు చూశాడు. గూగుల్‌లోని సంతకవిటిలోని ఓ షాప్ నెంబర్‌ను సేకరించాడు. ఆ షాపు చుట్టూ ఏయే కార్యాలయాలు ఉన్నాయో లొకేషన్ మ్యాప్‌లో చూశాడు. ఈ ఏడాది మార్చిలో సంతకవిటికి చెందిన పొట్నూరు శ్రీనివాసరావు అనే వ్యాపారికి కాల్ చేశాడు. వ్యాపారి వద్ద నుంచి మరో ముగ్గురు ఫోన్ నంబర్లు సేకరించి, వారి వద్ద నుంచి ఎస్ఐ.. అంటూ రూ.97 వేలు వసూలు చేశాడు. ఎస్ఐ కుమారుడికి బాగోలేదని, ఆస్పత్రిలో ఉన్నారంటూ ముగ్గురి నుంచి డబ్బులు ఫోన్‌పే చేయించుకున్నాడు. గంటలో కానిస్టేబుల్ ద్వారా డబ్బులు పంపిస్తానని, తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉండాలని వారికి నమ్మబలికాడు. ముగ్గురూ అక్కడ వేచిచూడగా, ఎంతసేపటికీ ఎవరూ రాకపోవడంతో వారు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని, సిబ్బందిని అడిగారు. దీంతో అసలు విషయం బయటపడింది. వారి ఫిర్యాదు మేరకు ఎస్ఐ గోపాలరావు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసి, నిందితుడు మోజేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సగం సొమ్మును రికవరీ చేశామని ఎస్ఐ తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారాజు

ప్రజాశక్తి-డెంకాడ



బంగార్రాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న గేదెల గాయత్రి

ప్రజల సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారాజు తెలిపారు. శుక్రవారం భోగాపురం మండలం పోలిపల్లి గ్రామంలో తన నివాసం వద్ద బంగారాజు.. ప్రజాదర్బార్ కార్యక్రమం చేపట్టారు. భూముల, ఎయిర్‌పోర్టు నిర్వాసితుల, సిసి రోడ్ల, కాలువల, విద్యుత్తు సమస్యలపై అర్జీలు అందాయి. ఈ అర్జీలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, టిడిపి నెల్లిమర్ల మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్లమెంట్ కార్యదర్శి లంక అప్పలనాయుడు పాల్గొన్నారు.

బంగార్రాజుకు ఎఎంసి చైర్‌పర్సన్ కృతజ్ఞతలు

పూసపాటిరేగ ఎఎంసి చైర్‌పర్సన్‌గా నియమితులైన గేదెల గాయత్రి... మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారాజును మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.. ఈ సందర్భంగా బంగారాజుకు పుష్పగుచ్ఛం అందజేసి, సత్కరించారు. డెంకాడ మండలం అక్కివరంలో టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర్‌ను ఎఎంసి చైర్‌పర్సన్ గాయత్రి మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎరువులను ఎంఆర్‌పికే విక్రయించాలి

ప్రజాశక్తి-గంట్యాడ

ఎరువులను ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని ఆర్‌డిఒ డి.కీర్తి సూచించారు. శుక్రవారం మండలంలో ఎరువుల దుకాణాలను పరిశీలించారు. మండల కేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్, వెంకటేశ్వర జనరల్ స్టోర్, శ్రీ బాలాజీ స్టోర్స్ ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఎంఆర్‌పి ధర కంటే అధిక రేట్లకు అమ్మిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. ఆర్‌డిఒ వెంట తహశీల్దార్ నీలకంఠేశ్వరరావు, బి.శ్యాంకుమార్, ఎఒ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

డీలర్లతో సమావేశం

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎఒ బి.శ్యామ్‌కుమార్ అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో శుక్రవారం జరిగిన ఎరువుల డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో తొమ్మిది షాపులు, నాలుగు పిఎసిఎస్‌ల నుంచి రైతులకు ఎరువులను అందిస్తున్నట్లు చెప్పారు. రైతుల నుండి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు.

ఎరువుల షాపులో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీలోని శ్రీనివాస ఎరువుల దుకాణంలో శుక్రవారం విజిలెన్స్ అధికారి టి.అప్పలనాయుడు, పలాస ఎడిఎ ఎం.రామారావు తనిఖీలు చేపట్టారు. ఎరువులు, పురుగుల మందులు, విత్తనాల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ పుస్తకాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో రికార్డులు, స్టాక్, బిల్లులు, ధరలు సరిపోయినట్లు గుర్తించారు. ఈ తనిఖీల్లో పి.శ్రీలక్ష్మి, జిల్లా వ్యవసాయ కార్యాలయ ఎఇఒ పి.కూర్మారావు, నెల్లిమర్ల ఎఇఒలు ఎం.నాగరాజు, బి.రమేష్ పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోవాలి

తెలంగాణ పిసిసి ప్రధాన కార్యదర్శి రాంభూపాల్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

తెలుగు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే అన్ని రంగాలలో అభివృద్ధి సాధ్యమని తెలంగాణ పిసిసి ప్రధాన కార్యదర్శి సిహెచ్ రాంభూపాల్ అన్నారు. శుక్రవారం రామతీర్థంలోని కోదండరామ స్వామి ఆలయాన్ని ఆయన సందర్శించి, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు రామతీర్థం మాజీ సర్పంచ్ కంచరాపు రాము, ఉప సర్పంచ్ లంక రామునాయుడు, సామాజిక ఉద్యమకారుడు తిరుమలరెడ్డి శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది స్వాగతం పలికి, సత్కరించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ స్వార్థ రాజకీయాలను పక్కనపెట్టి భవిష్యత్తు కోసం, ఉన్నత లక్ష్యాల కోసం రెండు రాష్ట్రాల రాజకీయవాదులు పనిచేయాలని కోరారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

న్యాయవాదులకు, సిబ్బందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరంలీగల్



జిల్లా జడ్జికి బిపి చూస్తున్న డాక్టర్ మహేంద్ర

స్థానిక న్యాయ వాదుల సంఘం, మహీంద్రా హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయ వాదుల సంఘం హాలులో న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి ఉచిత వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మహీంద్రా హాస్పిటల్ అధినేత డాక్టర్ బెవరా మహేంద్ర గిరి ఆధ్వర్యాన ఇసిజి, బిసి, సుగర్ వంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. రక్తదాతలకు జిల్లా జడ్జి బబిత సర్టిఫికెట్లు అందజేశారు. సంఘం అధ్యక్షులు కె.రవిబాబు, కార్యదర్శి ఎన్.సురేష్ కుమార్, కోఆర్డినేటర్ ఆర్.మురళీ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.